



హనుమాన్ చాలీసా పారాయణం

నూజివీడు: మండలంలోని తుక్కులూరు అడవి ఆంజనేయులు స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ముసునూరు మండలం సూరేపల్లికి చెందిన భజన సమాజం వారిచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.



పాఠశాలలకు శానిటరీ పరికరాలు అందజేత



ఉపాధ్యాయులకు శానిటరీ పరికరాలు అందజేస్తున్న ఎంఈఓ

చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎంఈఓ వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠశాలల టాయిలెట్ పరిశుభ్రత పరికరాలు పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ పరికరాలు అందజేశామని తెలిపారు.

16న వాహనాల వేలం

తిరువూరు: అక్రమ మద్యం తరలింపు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 16వ తేదీన వేలం వేయనున్నట్లు తిరువూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ గురవయ్య తెలిపారు. ద్విచక్రవాహనాలకు రూ.5 వేలు, ఇతర వాహనాలకు రూ.10 వేలు ధరావతు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పాడుకున్న వాహనాలకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 97048 86107లో సంప్రదించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



అసిస్టెంట్ లైన్‌మన్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం: ఇటీవల విధినిర్వాహణలో ప్రమాద వశాత్తు మృతి చెందిన అసిస్టెంట్ లైన్‌మన్ కన్నా వీరాంజనేయులు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పరామర్శించారు. ఫెర్రీలోని అయన గృహానికి మంగళవారం చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.



















క్లుప్తంగా

ఆర్థిక సాయం



జి.కొండూరు: జి.కొండూరుకు చెందిన చిట్టూరి వెంకటరమణ అనే నిరుపేద మహిళకు గృహ నిర్మాణం నిమిత్తం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గద్దె లింగయ్య రూ.20 వేల సాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ సాయాన్ని ఐతవరంలోని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ నివాసంలో ఆయన సమక్షంలోనే అందజేశారు. స్థానిక జగనన్న కాలనీలో వెంకటరమణకు ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చిన నేపథ్యంలో ఆమె ఇంటి నిర్మాణానికి గద్దె లింగయ్య అందించిన సాయాన్ని ఆదర్శంగా తీసుకొని పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు మరికొంతమంది ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం జరిగింది. దాత సూరే రత్నారెడ్డి, రవణమ్మ దంపతులు ఆర్థిక సహకారం అందజేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



ఆగిరిపల్లి: మండలంలోని గోపాలపురానికి చెందిన ఓ యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నంబూరు చంటిబాబు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మంచినేని వెంకటేశ్వరరావు(24) ఇంటి వద్ద నుంచే (వర్క్ ఫ్రం హోం) పనిచేస్తున్నాడు. అతను సోమవారం కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిక్కవరం వెళ్లాడు. అక్కడి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో యువకుడి తండ్రి అర్జున్ రావు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796444, 08656224233కు వివరాలు తెలపాలని విజ్ఞప్తి చేశారు.


పాము కాటుకు వ్యక్తి మృతి

చాట్రాయి: పాము కాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చాట్రాయిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మందపాటి నరసింహారెడ్డి (52) మంగళవారం రాత్రి పొలంలోకి వెళ్లగా పాము కాటు వేసింది. సమాచారం అందుకున్న బంధువులు స్థానిక వైద్యుడితో కలిసి పొలం వద్దకు వెళ్లి అపస్మారక స్థితికి చేరిన నరసింహారెడ్డికి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాల రవాణా వ్యాన్ పట్టివేత

ముసునూరు: పోలీసుల కళ్లుగప్పి కోళ్ల వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై ఎం.కుటుంబరావు మంగళవారం తెలిపారు. ఖమ్మం నుంచి ఏలూరు ప్రాంతంలోని ఆగడాలలంక చెరువుల్లో చేపలకు మేతగా ఉపయోగించేందుకు కోళ్ల వ్యర్థాలను వ్యాన్‌లో తరలిస్తుండగా మంగళవారం వాహన తనిఖీల్లో భాగంగా గోపవరం శివారు నాగేంద్రపురం కూడలిలో పోలీసులు అడ్డుకున్నారు. వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలు నింపిన, బరువైన ప్లాస్టిక్ సంచులు గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ మెండి శివను అదుపులోకి తీసుకుని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్, వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మొర్సుమల్లి కోలాట బృందానికి ప్రథమ బహుమతి



మొర్సుమల్లి(మైలవరం): దసరా సాంస్కృతికోత్సవాలు సందర్భంగా విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో జరిగిన కోలాట పోటీలలో మొర్సుమల్లి శ్రీఆంజనేయ కోలాట సమాజం బృందం ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు గ్రూపు ఆర్గనైజర్ తెనాలి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా సాంస్కృతికోత్సవాలు సందర్భంగా సోమవారం విజయవాడలో నిర్వహించిన ఈ పోటీలలో మొర్సుమల్లి శ్రీఆంజనేయ కోలాట సమాజం ప్రథమ బహుమతిగా రూ.20,000 అందుకున్నట్లు పేర్కొన్నారు.

పేదల ముంగిటకే కార్పొరేట్ స్థాయి వైద్యం



జి.కొండూరు మండలం కోడూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



నూజివీడు మండలం పోలసానపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

జి.కొండూరు: పేదల ముంగిటకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించారు. ఈ శిబిరం వద్ద ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. ప్రత్యక్ష ప్రదర్శనతో పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా వైరల్ ఫీవర్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ల వల్లన సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులకు కూడా చెక్ పెట్టేందుకు వీలు కలిగిందన్నారు.

731 మందికి వైద్యసేవలు

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం): గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఏబీఎం హైస్కూల్‌లో నిర్వహించిన క్యాంప్‌లో 731మంది రోగులు వైద్య సేవలు పొందారు. గంపలగూడెం, ఊటుకూరు పీహెచ్‌సీల వైద్యులు సురేష్, శశిప్రియ, పిల్లల వైద్యులు వాసవి, ఆర్థోపెడిక్ వైద్యులు భానుతేజ రోగులను పరీక్షించి, మందులను అందజేశారు. తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, సర్పంచ్ బజ్జూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు తమ్మారపు శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

నూజివీడు: రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పోలసానపల్లిలో మంగళవారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కార్పొరేట్ వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైద్యాధికారి అనూష, ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రంగారావు, తాండ్ర పాపారావు, ఆరేపల్లి రాంబాబు పాల్గొన్నారు.

ఎస్‌ఏపేటలో..

ఆగిరిపల్లి: మండలంలోని సింహాద్రి అప్పారావుపేట (ఎస్‌ఏపేట)లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 320 మందికి పరీక్షలు చేయగా వీరిలో 42 మందిని ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభాస్కర్, వైద్యులు జాస్తి జగన్‌మోహన్‌రావు, జ్యోష్ణరాణి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, మండల అధ్యక్షులు పలగాని నరసింహారావు, ఎస్‌ఏపేట సర్పంచ్ కూరాకుల శ్రీనివాసరావు, రాజవరం జ్వాలా భూషణం, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల, సచివాలయాల కన్వీనర్ భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని చిన్నంపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్లు కిరణ్మయ్, వైష్ణవి, దుర్గాప్రసాదు, జ్యోతి 268 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. సర్పంచ్ పరసా ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు భారతీ, పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు, తహసీల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీఓ దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

గోపవరంలో..

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు కలుగుతుందని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మండల టీమ్– 2 అధికారి, తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన గోపవరం సచివాలయం-1 ప్రాంగణంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్‌కుమార్, ప్రతాప్, ప్రత్యేక వైద్య నిపుణుడు సురేష్, ప్రసూతి వైద్య నిపుణురాలు స్వప్న సింధు 447 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. 132 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ముగ్గురికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, ఎంపీపీ కృష్ణ కుమారి, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్ వాణి, ఎంపీటీసీ ఖాలీషా మస్తాన్ వలి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నాగ వల్లేశ్వరరావు, ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

పుల్లూరు(మైలవరం): ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా వైఎస్సార్ ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం పుల్లూరులో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ రామిరెడ్డి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి పాల్గొన్నారు.

దాములూరులో..

దాములూరు(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి అండగా నిలిచిందని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. దాములూరు గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్య శిబిరంలో పీహెచ్‌సీ డాక్టర్లు, స్పెషలిస్ట్ వైద్యులు అందిస్తున్న మెరుగైన వైద్యసేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచ్ మదుసూధనరావు, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సాంబశివరావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని అన్నేరావుపేటలో జగన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మాధవిలత, మాజీ ఎంపీపీ కాంతారావు, తహసీల్దార్ పాల్, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, డాక్టర్ చెన్నకేశవ నాయక్ పాల్గొన్నారు.

ఎర్రమాడులో..

తిరువూరురూరల్: మండలంలోని ఎర్రమాడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బొర్రా మాధవి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో 100 మంది దీర్ఘకాలిక రోగులు, వివిధ వ్యాధుల బారిన పడిన వారికి ఈ శిబిరంలో వైద్యపరీక్షలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రా మోహన్‌రావు పాల్గొన్నారు.

కలగరలో..

కలగర(విస్సన్నపేట): పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించటమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. మండలంలోని కలగర సచివాలయం పరిధిలో స్థానిక ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ దేశిరెడ్డి రమ, ఎంపీటీసీ సభ్యురాలు పుల్లమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నూజివీడు: మండలంలోని కొత్త రావిచర్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ఆవరణలో నిర్వహించనున్న ఈ వైద్యశిబిరాన్ని ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామ సచివాలయం-2 పరిధిలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.



గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



ఆగిరిపల్లి మండలం ఎస్‌ఏపేటలో నిర్వహించిన వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు



చిన్నంపేటలో సురక్ష కిట్లను అందజేస్తున్న దేశిరెడ్డి



మైలవరం మండలం పుల్లూరులో పరీక్షలు చేయించుకుంటున్న ఏఎంసీ చైర్మన్



దాములూరు శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



గోపవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్



రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేటలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ విజయభాస్కరరెడ్డి



తిరువూరు మండలం ఎర్రమాడులో వైద్య శిబిరం



విస్సన్నపేట మండలం కలగరలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సీసీ రోడ్డు పనుల పరిశీలన



విస్సన్నపేట: స్థానిక కనక దుర్గా అమ్మవారి దేవస్థానం రోడ్డు గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగ మల్లేశ్వరి మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరిరావు, నాయకులు పిల్లి రాజేష్, కోటేశ్వరరావు, వై నాంచారయ్య, నాగేంద్రరావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



రెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి జయచంద్రగాంధీ అన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి బి. శ్రీనివాస్, విస్తరణ అధికారి బి.శ్రీనివాసరావు, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణీ, పంచాయతీ కార్యదర్శి డా. రవికుమార్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో తెలంగాణ ఎన్నికల సందడి



తిరువూరు: తెలంగాణ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు విడుదలైన సందర్భంగా తిరువూరు నియోజకవర్గ పరిసరాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి. తెలంగాణా పోలీసులు 24 గంటలూ ఈ చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పెనుబల్లి, కల్లూరు, మధిర, ఎర్రుపాలెం, వేంసూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆంధ్రా–తెలంగాణ సరిహద్దుల్లో ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ముత్తగూడెం వద్ద చెక్‌పోస్టు వద్ద వాహనాలను కల్లూరు ఏసీపీ రామానుజం, రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలలను అందరూ ఆదరించాలని హెచ్ఎం హన్నామణి అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు మెయిన్ పాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలలకు కల్పించే సౌకర్యాలు, వసతులు, వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్ ప్రశాంతి, ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీ నారాయణరావు, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య

నాడు–నేడు పనులతో గురుకుల విద్యాలయానికి మహర్దశ



హ్యాండ్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఏ.కొండూరు: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యాబోధనలో విద్యాలయ నిర్వహణలో జిల్లాలోనే ప్రగతి పథంలో ముందుకు వెళుతున్నారు అక్కడ ఉపాధ్యాయులు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పాఠశాలల అభివృద్ధికి నాడు–నేడు నిధులు కేటాయించారు. మండలంలోని కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల 200 మంది విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు. విద్యా బోధనతో పాటు క్రమశిక్షణ, క్రీడల్లో ప్రోత్సాహిస్తూ నైతిక విలువలు పెంపొందిస్తూ విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఈ విద్యాలయంలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నేడు 558 మంది విద్యార్థులున్నారు.

రూ.60 లక్షలతో అభివృద్ధి

నాడు–నేడు నిధులతో రూ.60.23 లక్షలతో మరుగుదొడ్ల, తాగునీరు, విద్యుత్, బెంచీలు, భవనాలకు మరమ్మతులు చేయించి రంగులతో తీర్చిదిద్దారు. విశాలమైన తరగతి గదులు సువిశాల క్రీడా ప్రాంగణం సౌకర్యవంతమైన డార్మిటరీతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ పాఠశాల ముందు కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకుంటోంది.

ఆధునిక సాంకేతిక విద్య

ఆధునిక సాంకేతిక విద్యా పరిజ్ఞాన అందిపుచ్చుకుంటూ 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేయడంతోపాటు బోధించేందుకు అనుభవిజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నారు.

వృత్తి విద్యాకోర్సులు

జిల్లాలోనే ఈ పాఠశాలలో విద్యతో పాటు వృత్తి విద్యాకోర్సులైన ఐటీ, అగ్రికల్చర్ కోర్సులు 9, 10, 11, 12 తరగతులకు అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ విద్యను అందిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ విద్యాబోధనను అందిస్తున్నారు. కేవలం విద్యాబోధనే కాకుండా విద్యార్థుల్లో దాగిన ప్రతిభను గుర్తించి వారు ఏయే అంశాల్లో ప్రతిభ చూపుతున్నారో గ్రహించి, తగు శిక్షణ ఇస్తున్నారు. దీంతో ఈ విద్యాలయ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుస్తున్నారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్‌ఫెయిర్‌లలో, మ్యాథ్స్ ఒలింపియాడ్స్‌లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు.


మెరుగైన ఫలితాలు

ఈ గురుకుల విద్యాలయంలో 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 70 శాతం, ఇంటర్మీడియట్‌లో 82శాతం ఫలితాలు సాధించారు. ఈ పాఠశాలలో జగనన్న విద్యా కానుకు ద్వారా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్, షూ, బెల్ట్ అందజేస్తున్నారు.

> **మెరుగైన విద్యను అందిస్తున్నాం**
>
> ఈ పాఠశాల, కళాశాలలో విద్య నేర్చుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాం. విద్యార్థులు ఇబ్బందులు గురికాకుండా ప్రభుత్వం అన్ని వసతులు కల్పించింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. –వి.ఎస్.ఆర్ శాస్త్రి, ప్రిన్సిపాల్



విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఏర్పాటు చేసిన షింకులు



కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎల్‌హెచ్ఆర్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఇన్‌చార్జి హెచ్ఎం కనకదుర్గ, వెంకయ్య

మైలవరం: రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కే కనకదుర్గ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఇన్‌చార్జి హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 9న విజయవాడ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన అండర్–19 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఉమ్మడి కృష్ణా జట్ల ఎంపికలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వై.సందీప్, ఎం.కార్తీక్ సాఫ్ట బాల్, పీ సందీప్‌కుమార్, పీ విఘ్నేష్, టి.అఖిల్, బీ నాగచరణ్, డీహెచ్‌వీ సాయికుమార్ బేస్‌బాల్‌కు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. త్వరలో కడపలో జరిగే పోటీలకు కృష్ణా జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ నెల 8వ తేదీన స్థానిక ఎస్ఎస్‌కే హైస్కూల్‌లో కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–18 జిల్లా జట్ల ఎంపికలో బి. మౌనిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 20 నుంచి చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఎంపికై న విద్యార్థులను, వ్యాయామోపాధ్యాయుడు వెంకయ్యను హెచ్ఎం అభినందించారు.

ఎంపీపీ పాఠశాల తనిఖీ



ముసునూరు: చిన్నారుల స్థాయిని అనుసరించి పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ బీవీ సుబ్బారావు సూచించారు. యల్లాపురం ఎంపీపీ పాఠశాలలో ఆయన మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి, క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులంతా చిన్నారుల స్థాయికి అనుగుణంగా, పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధనోపకరణాలతో విద్యా బోధన చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన రికార్డులను తనిఖీ చేశారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

పాయకాపురం(విజయవాడరూరల్): ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాయకాపురం, రాజీవ్‌నగర్లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో ఆయుర్వేద దినోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల రోజుల పాటు ప్రతి రోజు అందరికీ ఆయుర్వేదం అనే నినాదంతో ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆరోగ్య సంరక్షణలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు. అనంతరం సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ జెవి సాయిప్రసాద్ మాట్లాడుతూ.. ఆయుర్వేద ప్రదాత ధన్వంతరి అన్నారు. ఆయుర్వేద దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు.

వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి రుణాల మంజూరు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలో వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి రుణాల మంజూరుకు నిర్వహించిన క్రెడిట్ క్యాంపుకు అనూహ్యమైన స్పందన లభించిందని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి కె.శకుంతల తెలిపారు.

నగర వ్యాప్తంగా మూడు సర్కిళ్లలో నిర్వహించిన ఈ క్రెడిట్ క్యాంపులో మొత్తం 1,476 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. సర్కిల్–1 పరిధిలో 455 మందికి, సర్కిల్–2 పరిధిలో 545 మందికి, సర్కిల్–3 పరిధిలో 476 మందికి రుణాలు మంజూరయ్యాయన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
అసెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఏ.పి. -520001.
Email: arb.vijayawada@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్/కార్పొరేషన్ బ్యాంక్ ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రస్తుతం ఈ ఖాతాలు అసెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడకు బదలాయించబడినది.

[illegible]

ఇ-వేలం తేది & సమయం : 27-10-2023, మధ్యాహ్నం 12.00 గం.ల నుండి సాయంత్రం గం.05.00 ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేది : ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

రుణగ్రహీత(లు)/ సహహామీదారు(లు) / తనఖాదారు (లు)/ హామీదారు (లు), బకాయి మరియు రిజర్వు ధర , ధరావత్తు వివరములు దిగువ తెలుపబడినవి

[illegible]

రిజర్వుధర : రూ.8,78,85,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 87,88,500/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ.8,78,850/-

ఆస్తి-2 : మెస్సర్స్ శ్రీ విజయదుర్గా ఆయిల్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన తనఖా చేయబడిన ప్లాంట్ మరియు మిషనరీ

రిజర్వుధర : రూ. 2,43,00,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 24,30,000/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ.2,43,000/-

ఆస్తి-3 : మెస్సర్స్ శ్రీ విజయదుర్గా ఆగ్రో ఇండస్ట్రీస్ కు చెందిన తనఖా చేయబడిన ప్లాంట్ మరియు మిషనరీ

రిజర్వుధర : రూ. 1,22,31,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 12,23,100/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 1,22, 310/-

ఆస్తి-4 : [illegible]

రిజర్వుధర : రూ.31,19,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 3,11,900/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 31, 190/-

ఆస్తి-5 : [illegible]

రిజర్వుధర రూ.29,16,000/- | ధరావత్తు సొమ్ము : రూ.2,91,600/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 29,160/-

ఆస్తి-6 : [illegible]

రిజర్వుధర : రూ. 18,63,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 1,86,300/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,630/-

ఆస్తి-7 : [illegible]

రిజర్వుధర : రూ. 8,10,000/- | ధరావత్తు సొమ్ము : రూ.81,000/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 8,100/-

ఆస్తి-8 : [illegible]

రిజర్వుధర : రూ. 18,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ.1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,070/-

ఆస్తి-10 : [illegible]

రిజర్వుధర : రూ. 18,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,070/-

ఆస్తి-11 : [illegible]

రిజర్వుధర : రూ. 18,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ.1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,070/-

ఆస్తి-12 : [illegible]

రిజర్వుధర : రూ. 18,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,070/-

ఆస్తి-13 : [illegible]

రిజర్వుధర : రూ. 16,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,070/-

ఆస్తి-14 : [illegible]

రిజర్వుధర : రూ. 16,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ. 1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ.18, 070/-

ఆస్తి-15 : [illegible]

రిజర్వుధర : రూ. 18,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ.1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,070/-

ఆస్తి-16 : [illegible]

రిజర్వుధర : రూ.18,07,000/- | ధరావత్తు సొమ్ము : రూ.1,80,700/- | బిడ్ పెంపుదల మొత్తం : రూ. 18,070/-

[illegible] https://www.ibapi.in [illegible] www.unionbankofindia.co.in [illegible] Mail ID : arb.vijayawada@unionbankofindia.bank [illegible]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
[illegible]

తేది : 06-10-2023, ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడ





నృత్యం చేస్తున్న కళాకారులు





నేత్రపర్వంగా దసరా మహోత్సవాలు

దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు నృత్య సంగీత కళాశాలలో దసరా మహోత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. దసరా సాంస్కృతిక మహోత్సవ కమిటీ, మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సాంస్కృతిక మహోత్సవాలు జరుగనున్నాయి. కోలాటం, జానపద, శాస్త్రీయ నృత్యాల పోటీల్లో విద్యార్థినులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నిరాశ్రయులకు ఆవాసం కల్పించేందుకు వీఎంసీ చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ శకుంతల

పటమట(విజయవాడ తూర్పు): నిరుపేదలు వివిధ రకాల కారణాలతో నగరానికి వచ్చి ఉంటున్న వారికి ఆవాసాన్ని కల్పించేందుకు వీఎంసీ చర్యలు తీసుకుంటుందని వీఎంసీ అదనపు కమిషనర్(జనరల్), పట్టణ సమాజికాభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి కె.శకుంతల తెలిపారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 36వ డివిజన్‌లోని హనుమాన్ పేట నిరాశ్రయుల వసతి గృహంలో ఆదర్శ రూరల్ హెల్త్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. వీఎంసీ ఆధ్వర్యంలో నాలుగు నిరాశ్రయుల వసతి గృహాలను నిర్వహిస్తున్నామని, వివిధ పనులతో నగరానికి వచ్చినపుడు ఈ నిరాశ్రయుల వసతి గృహాలను వినియోగించుకోవచ్చునన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి, మరుగుదొడ్లు వంటి కనీస అవసరాలను ఈ వసతి గృహాల్లో పొందవచ్చని తెలిపారు.

స్వచ్ఛంద సంస్థలు మరింత అంకితభావం తో పని చేయాలని, నైట్ డ్రైవ్స్ నిర్వహించి, ఎక్కువ మంది ఈ వసతి గృహాలను వినియోగించుకునే విధంగా చూడాలని సూచించారు. బస చేసేవారు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌హెచ్‌డీఎస్ పీడీ రామకష్ణ, సర్కిల్–3 సీడీవో జగదీశ్వరి, మెప్మా కో ఆర్డినేటర్ మహాలక్ష్మి, సోషల్ వర్కర్ నాగరాజు, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, షెల్టర్ నిర్వాహకులు, కేర్ టేకర్స్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే విద్యుత్ బిల్లులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నియమ, నిబంధనల మేరకే విద్యుత్ బిల్లులు విధిస్తున్నామని, దీనిపై అపోహలకు తావు లేదని సీపీడీసీఎల్ హనుమాన్‌జంక్షన్ ఏఈ ఎ.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. మీటర్లు ఆగిపోవడం లేదా కాలిపోయిన సందర్భాల్లో నెలసరి యావరేజ్ యూనిట్లకు బిల్లు జారీ చేస్తారని చెప్పారు. ఎవరైనా విద్యుత్ వినియోగదారులు బిల్లులో ఎక్కువ రుసుం వస్తున్నట్లుగా భావిస్తే ఫిర్యాదు చేయవచ్చని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ అధికారుల పరిశీలన తర్వాత అదనపు బిల్లు వచ్చినట్లు నిర్ధారణ జరిగితే నిబంధనల ప్రకారం బిల్లు మొత్తాన్ని సరిచేస్తామని వివరించారు.

విజయవంతంగా మెగా ఆరోగ్య మేళాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మెగా ఆరోగ్య మేళాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. ఆమె మంగళవారం విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరు 1 విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో నిర్వహించిన మెగా ఆరోగ్య మేళాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో అందిస్తున్న సేవలపై అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమ గ్రామానికి పెద్ద డాక్టర్లు వచ్చి పరీక్షలు చేస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దాములూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న ఆరోగ్య మేళాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శిబిరాల్లో ఉన్న వైద్యులు నిరంజన్, విజయ పలు సూచనలు ఇచ్చారు. మెగా ఆరోగ్య మేళాల్లో గైనకాలజీ, పిడియాట్రిక్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటున్నందున ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

15 నుంచి శ్రీతిరుపతమ్మ ఆలయంలో నవరాత్రులు


ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీ దేవి శరన్నవరాత్రులను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ చెప్పారు. ఆలయంలో మంగళవారం దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ.. 15న శ్రీబాలత్రిపురసుందరీదేవి, 16న శ్రీగాయత్రిదేవిగా, 17న శ్రీఅన్నపూర్ణాదేవి, 18న శ్రీమహాలక్ష్మీదేవి, 19న శ్రీమహాచండీదేవి, 20న శ్రీసరస్వతీదేవి, 21న శ్రీలలితత్రిపురసుందరీదేవి, 22న శ్రీదుర్గాదేవి, 23న శ్రీమహిషాసురమర్దినిదేవి, శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఉత్సవాల్లో నిత్యం కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి జాస్తి నాని, కోశాధికారి జాస్తి ఫణిశేఖర్, సభ్యులు చిమట శ్రీనివాసరావు, పొట్ల శివలీల, జాస్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ నమోదు చేయాలి

నున్న(విజయవాడరూరల్): ఖరీఫ్ సాగు చేసిన ప్రతి రైతు తప్పకుండా ఈకేవైసీ నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ బాబు అన్నారు. నున్నలో మంగళవారం రైతుభరోసా కేంద్రంలో రైతులతో ఈకేవైసీ చేయించిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని 3,428 మంది రైతులకు 3,150 ఈకేవైసీ నమోదు చేశారని, 278 మంది రైతులు ఇంకా చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులు ఈ క్రాప్ నమోదుతో పాటు, ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో 13,995 ఎకరాల్లో వరి సాగు జరిగిందన్నారు. గతేడాది 14,775 ఎకరాల్లో వరిపంట సాగు జరిగితే ఈ ఏడాది 13,995 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందన్నారు. నగరానికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మార్చుకొంటున్నారన్నారు.

ఉత్సాహంగా భగవద్గీత శ్లోకాల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు భారతీయ విద్యామందిర్ పాఠశాలలో చిన్మయ మిషన్ ఆధ్వర్యాన భగవద్గీత శ్లోకాల పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో భగవద్గీత పఠనం పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహద పడతాయన్నారు. విద్యార్థులు నిత్యం భగవద్గీతను చదవటంతో పాటు ధర్మ మార్గాన్ని అనుసరించాలని సూచించారు.
























ఓటు ప్రాముఖ్యతను తెలిపేలా మార్టిన్ లూథర్‌కింగ్ మూవీ


ఎల్ఈపీఎల్‌లో ఓటు ప్రాముఖ్యతను వివరిస్తున్న సినిమా బృందం

పటమట(విజయవాడతూర్పు): మార్టిన్ లూథర్ కింగ్ మూవీ టీమ్ విజయవాడ నగరంలో మంగళవారం సందడి చేసింది. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా హీరో సంపూర్ణేష్ బాబు, దర్శకులు పూజ, వెంకటేష్ మహాలు నగరంలోని ఎల్ఈపీఎల్‌లో ప్రదర్శించిన ప్రీమియర్ షోకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేక్షకులతో కలిసి వారు సినిమాను చూశారు. అనంతరం ప్రేక్షకుల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హీరో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ మార్టిన్ లూథర్ కింగ్ మూవీ రీమేక్ మూవీ అయినప్పటికీ తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా తెరకెక్కించామన్నారు. ఓటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు చాటి చెప్పామన్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తోందన్నారు. రానున్న రోజుల్లో మంచి కంటెంట్ ఉన్న సినిమాలను నిర్మిస్తామని తెలిపారు.

ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం


మాట్లాడుతున్న మానసిక వైద్యురాలు అనూష

పటమట(విజయవాడతూర్పు): మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని నీ తోడు మానసిక వికాస కేంద్రం సైకాలజిస్ట్ జి.అనూష అన్నారు. పటమటలోని కోనేరు బసవయ్య బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నవజీవన్ బాల భవన్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆందోళన వల్ల అన్ని వయస్సుల వారు సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనివల్ల దీర్ఘకాలిక సమస్యలు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందన్నారు. మానసిక సమస్యలతో బాధపడేవారికి పెజ్జోనిపేటలోని తమ కేంద్రంలో సైక్రియాటిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్ అందుబాటులో ఉంటారని, వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్లు ఎస్.జాకబ్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి


చెట్లకు ప్లకార్డులను అంటిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని, విద్యార్థులు నిరంతరం హక్కులు, వివిధ సమూహాల స్థితిగతులను తెలియపరచే వారధులని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. కళాశాలలో సర్వీస్ లెర్నింగ్ పోస్టర్ డిస్ ప్లే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో యునైటెడ్ బోర్డ్ సహకారంతో ఈ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయపడాలని, కొవ్వొత్తులు వెలుగును పంచినట్లు విద్యార్థులు కూడా అసమానతలను రూపుమాపటానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పలు ప్లకార్డులను కళాశాలలోని చెట్లకు అంటించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఇన్నిక, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషా కుమారి, స్టాటిస్టిక్స్ అధ్యాపకురాలు సరజ వేదవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్బీపేట షాదీఖానా కల సాకారం


మాట్లాడుతున్న కార్పొరేటర్ రెహానా నాహిద్, సయ్యద్ అలీం, జగ్జీవన్‌రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న లబ్బీపేట షాదీఖానా కల సాకారం కానుంది. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కృషితో ఇప్పటికే పిచ్చయ్యవీధి చివరిలో స్థలం కేటాయించగా, అందులో భవన నిర్మాణానికి సంబంధించి ఈ నెల 13న ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషా చేతుల మీదగా శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా లబ్బీపేటలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహిద్, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీం తదితరులు వెల్లడించారు. లబ్బీపేటలో షాదీఖానా నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఇదిగో..అదిగో అంటూ నిర్మాణం చేపట్టకుండా కాలయాపన చేశారన్నారు. అంతేకాకుండా స్థలం కేటాయించినట్లు కొలతలు వేసి ముస్లింలను నమ్మించి మోసం చేశారన్నారు.

ముస్లింల పక్షపాత ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. ఆయన కృషి ఫలితంగానే షాదీఖానా నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని వారు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ముస్లింలందరికీ ఉపయోగపడేలా ఈ భవన నిర్మాణాన్ని చేపడతామని చెప్పారు. ముస్లింల పక్షపాత ప్రభుత్వంగా నిరూపించుకున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు సుభానీ, డైరెక్టర్ ఎండీ అబీద్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ మీర్‌హుస్సేన్, ఎస్కే సుభానీ తదితరులు పాల్గొన్నారు.


ఔషధ తయారీలో మార్పులపై అవగాహన


డాక్టర్ అన్నం సత్యనారాయణను సన్మానిస్తున్న ఫార్మసీ కళాశాల ప్రతినిధులు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ఔషధ తయారీలో వచ్చే మార్పులను ఆ రంగంలో నిపుణుల ద్వారా తెలుసుకోవటం అవసరమని రీసెర్చ్ లేబరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నం సత్యనారాయణ అన్నారు. కేఎస్ఆర్ ఫార్మసీ కళాశాల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటిక్స్-బయోటెక్నాలజీ విభాగం, జాతీయ ఔషధ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఔషధ తయారీలో నూతనంగా తీసుకువచ్చే మార్పులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలతో వచ్చిన మార్పులతో మందుల తయారీలో స్వల్పమైన తప్పిదాలకు కూడా అవకాశం లేకుండా ఉంటుందన్నారు. ఉన్నత ప్రమాణాలతో మందులు తయారీ దశలోనే వచ్చిన మార్పులను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆచంట సునీత, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి.రమణ పాల్గొన్నారు.

చెస్ పోటీలకు ఎంపిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ రామకృష్ణ చెస్ అకాడమీకి చెందిన విద్యార్థి అవ్వారు విజయ్‌కుమార్ రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన సిద్ధార్థ కాలేజ్‌లో చెస్ టోర్నమెంట్ జరిగింది. ఇందులో తమ విద్యార్థి మూడవ స్థానం సాధించడంతో పాటు రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎ.రామకృష్ణ తెలిపారు. విజయ్‌కుమార్ చదువుతున్న గూడవల్లిలోని శ్రీచైతన్య విద్యా సంస్థల డీన్ కె.శరత్‌బాబు విద్యార్థిని మంగళవారం సన్మానించి అభినందనలు తెలిపారు.

























ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

మైలవరం: నియోజకవర్గ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో పలు ఉద్యోగాలకు సంబంధించి ఎంపికైన వారికి నియామక పత్రాలను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు సంబంధించి ప్రభుత్వ విధి విధానాల మేరకు భర్తీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు, వెల్వడం సర్పంచ్ ధర్మరాజు, పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సాయిమందిరంలో సామూహిక వ్రతాలు



తిరువూరు సాయిమందిరంలో సాయివ్రతాలు

తిరువూరు: స్థానిక షిర్డి సాయి మందిరంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా సాయిబాబా వ్రతాలు ఆచరించారు. మందిర అర్చకుల పర్యవేక్షణలో మహిళలు సాయిబాబాకు విశేషార్చనలు నిర్వహించిన అనంతరం సామూహిక సాయివ్రతాల్లో పాల్గొన్నారు. భక్తులకు మందిర కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేద మృతి

ఇబ్రహీంపట్నం: మేతకోసం ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు వైపు వెళ్లిన పాడిగేద విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతి చెందింది. ఖిల్లారోడ్డు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న మేరా చారి పాడిపశువులను మేపుతూ జీవనం సాగిస్తుంటాడు. తన పాడిగేదను మేతకోసం ఎన్టీటీపీఎస్ చెరువువైపు తోలాడు. అక్కడ విద్యుత్ షాక్‌కు గురై గేద మృతి చెందింది. మృతి చెందిన గేద ఖరీదు రూ.95వేలు ఉంటుందని యజమాని చారి తెలిపారు. తన కుటుంబ జీవనోపాధికి కారణమైన పాడిగేద ఎన్టీటీపీఎస్ అధికారులు నిర్లక్ష్యంతో మృతి చెందినట్లు ఆరోపించారు. తక్షణం తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అధికారులను కోరారు.

















